విలాసముద్ర

మల్లారెడ్డి ప్రేమకవిత్వం

వౌలుజూపుల
వలపుగాలం
ఏం నాపై విసరుతావే
ఎత్తుమడమల
ఎగుడు దిగుడుగ
ఏం నర్తన మాడుతావే
ఒంటికంటిన
జిలుగు వలిపం
ఒంపు సొంపుల దాచలేదే
కోడె ప్రాయపు
సోయగాలను
మోయజాలక నడుం విక్కెను
మరుని జయ
కేతనములా
ఎగిరె ఎర్రని పైట నింగికె
వామహస్త వి
లాస ముద్రల
ఏమి సంకేతమ్ము లలనా?

సౌఖ్యం

కె.వి.ఎస్.వర్మ

"ఇం కెందుకాలస్యం. ఓ పెగ్ వెయ్యండి" అన్నాడు విజయ్ టీపాయ్ మీదున్న విస్కీ ఫుల్ బాటిల్ వంక చూస్తూ.

"బాటిల్ కనిపిస్తే నువ్వాగలేవు" అన్నాడు ఆదినారాయణ వేరుసెనగ పలుకులు ప్లేటులో పోస్తూ.

"త్వరగా మొదలెడితే త్వరగా ఇళ్లకెళ్లిపోయి పడుకోవచ్చుకదా" అన్నాడు విజయ్ బాటిల్ వంక చూస్తూ.

"నిజమేననుకో. అయితే, నరసింహమూర్తి రానీ" అన్నాడు వీరభద్రం తనకు దగ్గరగా వున్న ప్లేటులోని జీడిపప్పు పకోడి ఒకటి తీసుకుని నోట్లో వేసుకుంటూ.

"వస్తాడంటారా"

"ఎనిమిది గంటలకల్లా వస్తానన్నాడు. ఓ పది, పది హేను నిమిషాలు అటూ ఇటూ తప్పకవస్తాడు"

"ఏదన్నా పని తగిలిందేమో. రాడేమో" అన్నాడు విజయ్ బాటిల్ మూత తీసి వాసన చూస్తూ.

"రాడని ఎందుకనుకోవాలి"

"వస్తాడని ఎందుకనుకోవాలి"

"విజయ్‌కి విస్కీ వాసన తగలగానే కిక్ వచ్చేసినట్టుంది"

"అదేం కాదు. భద్రంగారూ, వస్తాడు, రాడుకు మధ్య దూరమెంతంటారు"

"అంటే"

"సత్యమెంతంటారు"

"వస్తాడు అన్నది విశ్వాసం. రాడు అన్నది అవిశ్వాసం"

"విశ్వాసం, అవిశ్వాసం మధ్య దూరమెంతంటారు"

"వస్తాడు, రాడుమధ్య ఎంతో, అంత"

"అప్పుడే మీరేవేవో మాట్లాడేస్తున్నారు. నేనిప్పుడే తట్టుకోలేను గురూ" అన్నాడు ఆదినారాయణ.

అంతలో నరసింహమూర్తి హాల్లోకి వచ్చి

"సారీ ఫర్ ది డిలే". అన్నాడు.

"రండి సార్. కూర్చోండి. మీ కోసమే ఎదురు చూస్తున్నాం" అని వీరభద్రం వంక చూసి "ఇం కెందుకాలస్యం, ప్రారంభించండి" అన్నాడు విజయ్ హుషారుగా.

ఛీర్స్ చెప్పుకుని మందు విందు మొదలెట్టారు.

హాల్లో ఓ మూల టీవీ మౌనంగా ఉంది. దాని మీద వీరభద్రం పెళ్లినాటి ఫోటో వుంది. హాలు నాలుగు గోడల మీదా ఫోటోలున్నాయి. ఓ గోడమీద మార్క్స్, ఓ గోడ మీద వివేకానందుడు చిర్నవ్వులొలికిస్తున్నారు. ఇంకో గోడమీద సాయిబాబా హాయిగా వున్నట్టున్నాడు. నాలుగో గోడ మీద ప్రకృతి పరవసిస్తోంది.

నరసింహమూర్తి హాలంతా చూసేక,

"మీ ఇంట్లో భిన్నత్వం కనిపిస్తోందోయ్ మనదేశంలాగే" అన్నాడు.

"ఏం"

"ఒక ఫోటోకీ మరో ఫోటోకీ సంబంధం లేకపోతేనూ"

"మార్క్స్ ఫోటో నేను పెట్టుకున్నది. మిగతావి మా ఇంట్లో వాళ్లవి. ఎవరి విశ్వాసాలు వాళ్లవి" అన్నాడు వీరభద్రం.

"విశ్వాసం అంటే ఏమిటండి" అన్నాడు విజయ్ గ్లాసు ఖాళీ చేస్తూ.

"విశ్వాసం అంటే"

"నమ్మకం"

"మేమింకా రెండు సిప్‌లు వేయలేదు. నువ్వప్పుడే గ్లాసు ఖాళీ చేసేసేవు"

"విజయ్‌కు తొందరెక్కువ"

"పొయ్యండి సార్" అన్నాడు విజయ్ తన ధోరణిలో

"కాసేపు ఆగవయ్యా. మాతో కలుద్దువుగానీ" అన్నాడు ఆదినారాయణ.

"విశ్వాసం అంటే నమ్మకం. నేనో విషయం నమ్మాననుకోండి. అది విశ్వాసం నేను నమ్మింది జరగలేదనుకోండి. అప్పుడు నమ్మకం విశ్వాసమెలా అవుతుంది" అన్నాడు విజయ్ బాటిల్ వంక మానేసి వాళ్ల గ్లాసుల వంక చూస్తూ.

"నువ్వు చెప్పింది స్పష్టంగా లేదు. కాస్త వివరించు" అన్నాడు వీరభద్రం గ్లాసు ఖాళీ చేస్తూ.

"ఉదాహరణకు మీ మార్క్స్ సిద్ధాంతమే వుందనుకుందాం. మీరు పాతికేళ్లుగా దాన్ని నమ్మారు. అది ఫెయిలయ్యిందంటే, మీ నమ్మకం విశ్వాసం కాదన్నమాటే కదా"

"మార్క్సిజం ఫెయిలయిందని ఎవరన్నారు"

"కమ్యూనిజం"

"అసలు కమ్యూనిజం ఎక్కడున్నా ఏర్పడివుంటేకదా ఫెయిలవ్వడానికి"

"పోనీ సోషలిజం. ఫెయిలయిందనే పత్రికలు రాశాయి. చాలామంది అంటున్నారు. అంటే మీరు నమ్ముతూ వచ్చిన ఇరవై అయిదేళ్ల మీ జీవితం అవిశ్వాసంతో నడిచినట్టేగా" అన్నాడు విజయ్ సిగరెట్టు వెలిగించుకుంటూ.

వీరభద్రం ఏదో చెప్పబోతుంటే, "ముందు గ్లాసుల్లో మందుపొయ్యి" అన్నాడు నరసింహమూర్తి.

వీరభద్రం ఆ పనిలో పడ్డాడు.

"విజయ్, మీరు చెప్పిందాంట్లో కొంత నిజముందనిపిస్తోంది. ఒక్కోసారి సిద్ధాంతం కంటే జీవితమే ముఖ్యమవుతుంది" అన్నాడు నరసింహమూర్తి, వేరుసెనగ పలుకులు నోట్లో వేసుకుంటూ.

నింపిన గ్లాసులు వాళ్లముందు పెట్టి

"నేనలా అనుకోవడంలేదు. జీవితం కంటే సిద్ధాంతమే ముఖ్యం" అన్నాడు వీరభద్రం

విజయ్ ఏదో అనబోయాడు. వీరభద్రం కూడా ఏదో అనబోయాడు.

"భద్రం. నేనో కథ చెబుతాను. తర్వాత నీ అభిప్రాయం చెప్పు"

"కథలొద్దు సార్" అన్నాడు విజయ్.

"కథ కాదు లెండి. ఒకామె గురించి చెబుతాను"

"అయితే చెప్పండి సార్"

కానిమ్మన్నట్టు చూశాడు వీరభద్రం.

నరసింహమూర్తి విస్కీ కొంచెం చప్పరించి, ఓ రెండు నిమిషాలు కళ్లు మూసుకున్నాడు. తర్వాత కళ్లు తెరిచి, ముగ్గురివంకా చూసి గొంతు సవరించుకున్నాడు.

"ఒకామె వుండేది"

"పేరు లేదా"

"సీత, సావిత్రి, అనసూయ"

"పతివ్రతల పేర్లు చెబుతున్నారు"

"పతివ్రత అంటే"

"భర్తే సర్వస్వంగా బతికేది"

"సిద్ధాంతమే సర్వస్వంగా బతికేవాళ్లూ పతివ్రతలే కదా"

"ఏం చెప్తారు సార్"

"చెప్పనీ సోదరా"

"సరేసరే"

పదేళ్ల క్రితం నేనామెను మొదటిసారి చూశాను. అదీ మేరేజ్ రిసెప్షన్‌లో. నా మిత్రుడు యశ్వంతరావు భార్య, పెద్దలు కుదిర్చిన పెళ్లి. అప్పుడు నేనామెను పలకరించలేదుకూడా.

తర్వాత రెండేళ్లకు ఓ సాహితీ సమావేశంలో చూశాను. అయితే, అప్పుడామెను నేను గుర్తుపట్టలేదు. ఎక్కడో చూసి నట్టనిపించింది.

"స్త్రీలను బానిసల్ని చేసింది పురుషులే. తమ స్వార్థంకోసం స్త్రీలను వంటింటి కుందేళ్లను చేశారు. పురుషాహంకారం అడుగడుగునా ఆడవాళ్లను అణచివేస్తోంది. ఆర్థిక స్వాతంత్ర్యం ద్వారానే స్త్రీలకు స్వేచ్ఛ వస్తుంది" అంటూ ఆమె ఆవేశంగా మాట్లాడుతోంది.

"ఎవరావిడ" అని పక్కనున్నతన్ని అడిగాను.

"సీత"

"రచయిత్రా"

"ఈ మధ్యే సాహితీ సమావేశాలకు వస్తోంది. ఏమన్నా రాసేంద్రోలేదో తెలీదు" అన్నాడతను.

సీత మాట్లాడటం అయ్యాక, మరొకరు తన అభిప్రాయం చెప్పడం మొదలెట్టారు. నేను సిగరెట్ కాల్చుకుందామని గౌతమి గ్రంథాలయం హాల్లోంచి బయటికొచ్చి, సిగరెట్ వెలిగించి పక్కనే వున్న ప్రహరీ పిట్టగోడ మీద కూర్చున్నాను. దూరంగా కూర్చున్న వ్యక్తిని చూసి.

"యశ్వంత్" అన్నాను నవ్వుతూ.

"సింహం" అన్నాడు తనూ ఆశ్చర్యంగా.

"ఈ వూరికెప్పుడొచ్చావు. ఇక్కడ ఒంటరిగా కూర్చున్నావేమిటి" అని అడిగాను.

"మా వూల్లో పొలాలు అమ్మేసి, ఇక్కడ వ్యాపారం చేస్తున్నాను. అప్పుడే సంవత్సరమయింది మేమిక్కడికొచ్చి. నువ్వెప్పుడొచ్చావు."

"నాకు ఇక్కడికి ట్రాన్స్‌ఫరయ్యింది. మొన్ననే జాయినయ్యాను. ఇంకా ఫేమిలీని తీసుకురాలేదు" అన్నాను.

కబుర్లలో పడ్డాం.

'మా సీత కోసం ఈ మీటింగ్‌కొచ్చాను. నాకేమో సాహిత్యం అంటే పడదు. తనకేమో చాలా ఇష్టం. అందుకే నేనిక్కడ కూర్చున్నాను. ఆదివారాల్లో నాకిది మామూలే. నువ్వా కవిత్వం గివిత్వం అంటూ వుండేవాడివి కదా. ఇప్పుడూ రాస్తున్నవా, మానేసావా"

"తిరిగే కాలూ, రాసే చెయ్యి వూరుకోవుకదా. అప్పుడప్పుడూ రాస్తున్నాను."

"నువ్వురాసే కవిత్వం అర్థమవుతుందా అందరికీ? నాకర్థం కాదనుకో ఎవరి కవిత్వమూ"

"అందరికీ అంతా అర్థం కాదు. కొందరికి అంతా అర్థమవుతుంది. కొందరికి కొంత అర్థమవుతుంది. పాఠకుల స్థాయిని బట్టి అదుంటుంది" అన్నాను.

సమావేశం ముగిసినట్టుంది. ఒక్కొక్కళ్లూ హాలు బయటికొచ్చి మెట్లు దిగుతున్నారు.

సీత యశ్వంత్ దగ్గరకొచ్చి "వెళ్దామా" అంది.

యశ్వంత్ ఆమెకు నన్ను పరిచయం చేశాడు.

"నమస్కారమండి. మీ కవితలు కొన్ని చదివాను. ఇవేళ మా ఇంటికి భోజనానికి రండి" అంది సీత.

"ఇవేళ రాలేను. మరోనాడు వస్తాను"

"రేపు సాయంకాలం తప్పకరండి" అంది.

యశ్వంత్ కూడా చెప్పడంతో అలాగే అన్నాను. వాళ్లింటి అడ్రస్ చెప్పారు.

మర్నాడు ఆఫీసవగానే లాడ్జికెళ్లి స్నానం చేసి, యశ్వంత్ ఇంటికెళ్లాను.

"నమస్తే రండి రండి" అంటూ కుర్చీ చూపించింది సీత.

"యశ్వంత్ ఇంకా రాలేదా"

"వ్యాపారంకదా. ఒక టైమంటూ ఉండదు. మీ గురించి ఇవేళ త్వరగానే వస్తానన్నారు. కాఫీనా, టీనా ఏం తీసుకుంటారు"

"ఏదన్నా ఫర్వాలేదు"

"అలాక్కాదు. మీ కేది ఇష్టమయితే అది కలిపి తెస్తాను"

"టీ తెండి"

"ఇది చదువుతుండండి" అని ఓ వీక్లీ నాకిచ్చి ఆమె లోపలి కెళ్లిపోయింది.

వీక్లీ తిరగేస్తూ కూర్చున్నాను.

"తీసుకోండి" అని నా చేతికి టీ కప్పు ఇచ్చి, ఎదురుగా కుర్చీలో తనూ కుర్చుంది.

"మీరు తాగరా"

"నేనిందాకే తీసుకున్నాను"

"సాహిత్యమంటే మీకిష్టమని యశ్వంత్ చెప్పాడు. మీరేమన్నా రాశారా"

"రెండు మూడు కవితలూ, ఓ కథ, మూడు నాలుగు వ్యాసాలూ రాశాను. ఎక్కువగా లేఖలు రాస్తుంటాను"

"నా కవిత అస్పష్టంగా వుందంటూ ఆ మధ్య వీక్లీలో వచ్చిన లేఖ మీది కాదుకదా" అని అడిగాను అనుమానంగా.

"అవును. నాదే"

"చాలా ఘాటుగా రాశారు. ఒక్కోసా

(మిగతా 6వ పేజీలో)

'పూత' రేకులు

బేరాల తల్లి!

ఆదివారం ఉదయం పెరట్లో మొక్కలను చూస్తున్న లక్ష్మిని 'ఏమ్మా లక్ష్మి! భోజనాలయ్యాయా' అంటూ పక్కింటి గాయత్రి మేడమీద నుంచి తొంగిచూస్తూ పలకరించింది. లక్ష్మి తలెత్తి చూసి 'ఇంకా లేదండీ' అంటూ బదులిచ్చింది.

'నువ్వు కట్టుకున్న చీరె కొత్తదల్లే ఉందే. కలర్, డిజైన్ రెండూ బావున్నాయి.' అడిగింది గాయత్రి 'నూటయాభై' అంది లక్ష్మి 'ఎక్కడకొన్నారేమిటి?' మళ్ళీ అడిగింది గాయత్రి 'ఫ్యాషన్స్ సెంటర్‌లో' చెప్పింది లక్ష్మి 'ఏమిటో లక్ష్మీ నేనూ వందలు వందలు డబ్బు పోసి చీరెలు కొంటా గానీ తీరా నాకది నచ్చదు. ఈసారి నాతో షాపింగ్‌కు వచ్చి సెలక్షన్‌లో సాయం చేస్తావా?' అడిగింది. గాయత్రి. 'ఓ దానికేం భాగ్యం' అంది లక్ష్మి. 'అయితే మంగళవారం మధ్యాహ్నం వెళ్దాం' అంది గాయత్రి 'అలాగే లెండి' అంది లక్ష్మి.

○ ○ ○

మంగళవారం నాడు. 'లక్ష్మీ! నేను రెడీ. నీకేమన్నా ఆలస్యం ఉందా' మేడమీద నుంచే అరిచింది గాయత్రి. 'లేదు, వచ్చేయండి' చెప్పింది లక్ష్మి. ఇద్దరూ బయల్దేరారు. 'సిటీ బస్సుల్లో వెళ్ళడమంటే నాకు చిరాకు' అంది గాయత్రి. లక్ష్మి ఆటోకేకేసింది. ఇద్దరూ ఎక్కి కూచున్నారు. ఫ్యాషన్ సెంటర్ రానే వచ్చింది. 'బాజూ రోకో' లక్ష్మి ఆటో వాడికి చెప్పింది. ఆటో ఆగింది. మీటరు చూస్తే పది రూపాయల చిల్లర అయింది. గాయత్రి ఒకసారి పర్స్ తెరిచి 'నా దగ్గర అన్నీ వందరూపాయల నోట్లే ఉన్నాయమ్మా' అంది 'ఫర్వాలేదు నేనిస్తాలెండి' లక్ష్మి ఆటో వాడికి డబ్బులిచ్చేసింది. ఇద్దరూ షాపులోకి ప్రవేశించారు. సేల్స్‌మెన్ చీరెలన్నీ ఓపిగ్గా చూపిస్తున్నాడు. లక్ష్మి సెలక్ట్ చేసిన చీరెలు చూసి చప్పరించింది గాయత్రి. లేత రంగులు మాపు కాగవని ఒకసారి, ముదురు రంగులు తనకు బాగోవని ఇంకోసారి. పువ్వులుంటే బార్డర్ కావాలని, బార్డర్ ఉంటే మరీ పెద్దగా ఉందనీ ఇలా ఏదో వంక పెట్టి దాదాపు ఒక గంట గడిచాక ఒక చీరె తీసుకుని రేటు అడిగింది. సేల్స్‌మేన్ దానిమీద రేటు చూసి 'నూటఎనభై' అన్నాడు. 'దానిమీద వేయటానికేంలే. అలాగే వేస్తారు. నూటనలభై మించదు ఈ చీర. నూటనలభైకిస్తే తీస్కుంటా' అంది 'మా దగ్గర అన్నీ ఫిక్సెడ్ రేట్లండీ ఎక్కువ చెప్పం' అన్నాడు సేల్స్‌మేన్ 'లక్ష్మి చెప్పు. మొన్న నూట నలభైకేగా నువ్వు తెచ్చింది' కళ్ళతోనే ఆదేశిస్తూ అడిగింది. లక్ష్మి ఇరకాటంలో పడింది. షాపువాడు లక్ష్మికేసి సూటిగా చూస్తున్నాడు. లక్ష్మికి అబద్ధం చెప్పడానికి నోరు రాలేదు. 'తేలేదు' అంటే గాయత్రి మాటపోతుంది. అది బాగోదేమో అనుకుని, క్షణం ఆలోచించి 'నూట నలభైకి తీసుకున్న చీరె ఇక్కడ కొన్నది కాదులెండి' అంది. గాయత్రికి ఆశాభంగమై, మొహం గంటు పెట్టుకుని 'వ్యాపారమన్నాక బేరం లేకపోవడమేమిటి? మరీ ఇంత 'నిక్కచ్చి' అని నాకేం తెలుసు' అంటూ ఏకకాలంలో లక్ష్మివైపు, సేల్స్‌మేన్ వైపు సురసురా చూసింది 'అయినా చీరె నచ్చాక ముప్ఫై నలభైకోసం మొహం చూసుకునేదాన్నికానులే' అంటూ నూట ఎనభై ఇచ్చి చీరె తీసుకుంది. లక్ష్మికి ఆవిడ ధోరణి కంపరం కలిగించింది. మళ్ళీ ఆ షాపుకి రాలేననుకుంది' లక్ష్మి. ఇద్దరూ షాపు బయటకు నడిచారు.

'మా వాడికి అండర్ వేర్లు లేవు కొంటా' అంటూ మరో షాపు వైపు నడిచింది. ఈసారి లక్ష్మి కాస్త దూరంగా నుంచుంది. 'లక్ష్మి! నువ్వూరా' గట్టిగా పిలిచిందిగాయత్రి. తప్పదనుకుంటూ వెళ్ళింది లక్ష్మి. అక్కడున్న అండర్ వేర్సన్నీ అటూ ఇటూ చేసింది గాయత్రి. 'ఏ నెంబర్ కావాలీ' అడిగాడు షాపతను. 'నెంబర్ తెలీదయ్యా' అంది గాయత్రి. 'ఎన్నేళ్ళకు రాడమ్మా' అడిగాడు. 'పది హేనేళ్ళు' చెప్పింది గాయత్రి. షాపతను తీసిచ్చాడు. గాయత్రి లక్ష్మికి చూపించి 'సరిపోతాయంటావా' అనడిగింది. లక్ష్మికేం చెప్పాలో తెలీలేదు. ఆ వ్యవహారం తొందరగా అయిపోతే అక్కడ్నుంచి బయటపడొచ్చునని 'ఆ సరిపోతుంది లెండి' అంది 'సరే ఎంతేమిటి?' అడిగింది గాయత్రి. 'ఈచ్ టెన్ రుపీస్ అండీ!' అన్నాడు వాడు. 'ఇంత చిన్న సైజు పది రూపాయలా' అంది గాయత్రి 'పోనీ పెద్దవే తీసుకోండి!' అన్నాడు షాపువాడు పళ్ళికిలిస్తూ లక్ష్మికి చిరాకేసింది 'చిన్నవే కావాలి. ఎనిమిది రూపాయలు చేసుకో' అంది గాయత్రి. 'పడదు' అన్నాడు షాపువాడు చివరకు 'తొమ్మిదిన్నరకు ఒప్పించి రెండు అండర్ వేర్లు తీసుకుంది. లక్ష్మి 'హమ్మయ్య' అనుకుని 'ఇంక వెళ్దామా' అని అడిగింది.



'వుండు లక్ష్మీ మళ్ళీ మళ్ళీ రావటం పడదు. ఒక స్టీల్ కేరియర్ కొనాలి' అంటూ పక్కనున్న స్టీల్ షాపులోకిదారితీసింది. లక్ష్మి ఉస్సురంటూ అనుసరించింది. స్టీల్ కేరియర్ లు అన్ని సైజులవీ, అన్ని మోడల్స్‌వీ తీయించి అరవైసార్లు చూసి రేట్లు అడిగింది గాయత్రి. చివరకు ఎలాగైతేనేం ఒక రెండు గిన్నెల కేరియర్ తీసింది. మళ్ళీ బేరం మొదలు. వాడు అరవై రూపాయలంటే 'చిన్న సైజే గదా' అంటుంది గాయత్రి 'చిన్నవే ఎక్కువ రేటుంటాయండీ' అన్నాడు వాడు. 'అదేం కాదు. తూకం లెక్కన ఇవ్వా'లంటుంది గాయత్రి. తమ దగ్గర తూకం పద్ధతిలేదన్నాడు షాపతను. చివరకు యాభై అయిదుకు రాజీపడి కేరియర్ తీసుకుంది తిరిగి ఆటో ఎక్కారు. 'నువ్వేం తీసుకోలేదేం' అడిగింది గాయత్రి. ఏం చెప్పాలో తోచక 'కొనే మూడ్‌లేదండీ' అంది. 'అయ్యో ఆ మాట ముందే చెబితే ఇంకో రోజు వెళ్ళేవాళ్ళంగా. నువ్వేదో గొప్పగా బేరం చేస్తావనుకుంటే వులుకూ, పలుకూ లేకుండా ఉండిపోతివి' అంది. లక్ష్మి ఏం మాట్లాడలేదు..

○ ○ ○

గాయత్రితో షాపింగ్‌కి వెళ్ళిన చేదు అనుభవంతో ఆవిడతో మరి మాట్లాడబుద్ధికాలేదు లక్ష్మికి. చిత్రం ఏమిటంటే గాయత్రి కూడా లక్ష్మిని చూసి మొహం తిప్పుకోసాగింది. పైగా పక్కింటి సుజాతతో 'లక్ష్మితో షాపింగ్ కెళ్ళాను. తీరా ఆ చీరె మా వారికి నచ్చనేలేదు. 'సరిపోతాయి తీసుకోండి' అని కొనిపించిన అండర్ వేర్లు మా వాడికి సరిపోనేలేదు. దండగబేరం అయింది' అంది గాయత్రి.

— జె.శ్యామల

సారాంశం

(5వ పేజీ తరువాయి)

రి అందంగా చెప్పేటప్పుడు అస్పష్టంగా ఉండొచ్చు''

''నేను దాన్ని అందంగా చెప్పడం అనుకోను. నిర్లక్ష్యంగా చెప్పడం అంటాను. మీ రెందుకు రాస్తున్నారు? పత్రికల్లో ఎందుకు ప్రకటిస్తున్నారు?''

''నా అభిప్రాయాలు నలుగురితో పంచుకోవడానికి''

''అలాంటప్పుడు అందరికీ అర్థమయ్యేలా రాయాలి కదా''

''అర్థమయ్యే వాళ్లకు అర్థమవుతుంది. కాని వాళ్లకు కావు. కొన్ని ఏ పదేళ్లకో కొందరికర్థమవుతాయి''

''అయితే, ఇప్పుడే ప్రకటించడం ఎందుకు? ఓ పదేళ్లాగి అప్పుడే ప్రకటించండి'' అంది సీత విసురుగా.

నేను ఖంగుతిన్నాను.

''ఏం మాట్లాడరు'' అంది.

ఆమె వంక చూశాను. ఎలాగయినా నన్ను ఒప్పించడానికి కంకణం కట్టుకున్నట్టుంది.

''అస్పష్టత లేకుండా రాసే ప్రయత్నం చేస్తాలెండి''

''అదేదో నన్ను ఉద్ధరించడానికి వేయబోతున్నట్లు చెబుతారేం? అలా రాయడం పాఠకుల పట్ల మీకుండాల్సిన బాధ్యత'' అంది.

ఇంతలో యశ్వంత్ వచ్చాడు.

''సారీ బాగా లేటయింది'' అన్నాడు.

''శారీలు బాగా అమ్మి వచ్చి, సారీలు చెప్పడం మీకలవాటేగా'' అంది సీత.

''సర్లేకానీ, టీ ఇస్తావా? మీరు తాగారా''

''మేం తీసుకున్నాం'' అని, ఫ్లాస్కులోంచి కప్పులో పోసి ఇచ్చింది.

''మీక్కూడా ఇవ్వనా''అంది.

వద్దన్నాను.

''మీరు మాట్లాడుతూ ఉండండి. అన్నం వండి వస్తాను'' అని సీత వంటగదిలో కెళ్లింది.

యశ్వంత్, నేనూ కబుర్లలో పడ్డాం.

రాత్రి ఎనిమిదిన్నరయింది. భోజనాలయ్యాయి. వాళ్లు ఎవరి కంచాలువాళ్లు కడుగుకుంటుంటే, నేనూ నా కంచం కడిగాను

''ఈయన వ్యాపారం చెయ్యడం నాకిష్టంలేదు'' అంది సీత.

''వ్యాపారాలు ఎందరు చేయడంలేదు ఇందులో తప్పేంవుంది..''

''తప్పా, తప్పున్నరా. అంతా మోసమే కదా''

''మోసమేం ఉంది''

''పది రూపాయల చీర ఏభై కమ్మడం జనాన్ని మోసం చెయ్యడం కాదా''

''అలా అమ్మకపోతే లాభాలెలా వస్తాయి''

''మీరిలా మోసం చెయ్యడం వల్లేకదా ఎంతో మంది పేదవాళ్లు ఒకటే అరా చీరలతో గడుపుకోవాల్సి వస్తుంది''

''దాంతో మాకు సంబంధమేముంది'' అన్నాడు యశ్వంత్.

''ఎందుకు లేదూ? పది రూపాయల చీర పన్నెండుకో, పదమూడుకో అమ్మితే చాలామందికి అందుబాటులో ఉంటుంది కదా'' అంది సీత తీవ్రంగా.

''ఆ లాభాలు మీ కోసమే''అన్నాను మధ్యలో కలిగించుకుంటూ.

''మీరు కూడా సపోర్టు ఛెయ్యండి. ఇంక జనాన్ని జలగలాగ పీల్చేస్తాడు'' అంది సీత కటువుగా.

నేను మరోసారి ఖంగుతిన్నాను.

కాసేపు మౌనంగా కూర్చున్నాను.

''వెళ్లొస్తాను'' అని లేచాను.

''వస్తుండండి. మీ ఫేమిలీ వచ్చాక తీసుకురండి. అన్నట్లు ఇల్లు చూశారా''

''లేదండి. మా ఆఫీసులో చెప్పాను. కొందరు చూస్తామన్నారు''

''నేను కూడా చూస్తాను. మీ ఫోన్ నెంబరివ్వండి'' అంది సీత.

కాగితం మీద రాసిచ్చాను.

''నా మాటలకేం అనుకోకండేం. ఉన్నదున్నట్లు మాట్లాడ్డం నాకలవాటు'' అంది

నవ్వి, బయట పడ్డాను.

ఆఫీసు పనిలోపడి, యశ్వంత్ ఇంటికి వెళ్లలేదు. వారం రోజుల తర్వాత సీత ఫోన్ చేసింది.

''ఇల్లు దొరికిందా'' అని అడిగింది.

''ఇంకా లేదు'' అన్నాను.

''నేనో ఇల్లు చూశాను. ఇవేళ సాయంత్రం మా ఇంటికి రండి. నేను చూపిస్తాను. నచ్చితే మంచిదే. లేకపోతే మరోటి చూద్దాం'' అంది.

''థాంక్యూ ఆఫీసవగానే వస్తాను'' అన్నాను.

నవ్వేసి, ఫోన్ పెట్టేసింది.

ఇద్దరం వెళ్లి చూశాం. ఇల్లు నచ్చింది. అడ్వాన్సు ఇచ్చి వచ్చాం.

''సీతగారూ, చాలా థాంక్సండి. శ్రమపడి ఇల్లు వెదికి పెట్టేరు'' అన్నాను.

''భలేవారే! ఇందులో శ్రమేముంది? ఒకరి కొకరు ఆ మాత్రం సాయం చేసుకోపోతే ఎలాగ'' అంది.

నేను కృతజ్ఞతా పూర్వకంగా ఆమె వంక చూశాను.

''మళ్లీ ఏమన్నా రాశారా?''

''లేదు. ఆఫీసు పనితోనే సరిపోతోంది'' అన్నాను.

''మనదేశంలోని కవులూ, రచయితలూ గొప్పవాళ్లండి. ఎవరో అతి కొద్దిమందికి తప్పించి, దాదాపు ఎవరికీ తమ రచనల మీద బతికే అవకాశంలేదు. తమ బతుకు తెరువు చూసుకుంటూనే ఇందరు ఇంత బాగా రాస్తున్నారు. కేవలం రచనలే బతుకు తెరువు చూపిస్తే ఇంకెన్ని గొప్ప రచనలు వచ్చేవో'' అంది.

''మీరన్నది నిజమేనేమో. మీరెందుకు తరచూ రాయడం లేదు?''

''రాస్తున్నానండి అది నా బాధ్యతగా భావిస్తున్నాను. ఇవేళ ఓ పత్రికలో నా లేఖ వచ్చింది'' అంటూ టిపాయ్‌మీదున్న పేపర్ తీసి చూపించింది.

చదివాను. చక్కటి భాష. అందులో ఎంతో ఆవేదన, ఆవేశం ఉన్నాయి. కర్తీస్తారా దుర్ఘటన మీద రాసింది. ఈ వ్యవస్థ ఇలాగున్నంతకాలం ఇలాంటి దుర్ఘటనలు జరుగుతూనే ఉంటాయంది. ప్రధాన బాధ్యత ప్రభుత్వానిదే అంది.

''మీరు కవితలూ, కథలూ రాయొచ్చు కదా'' అన్నాను.

''నేనెందుకు రాయాలి. నేను కవయిత్రిని కాను. మీలాంటి కవులేమో పట్టించుకోరు. ఇక నాకున్న మార్గం లేఖ. నేను చెప్పదలచుకుంది సూటిగా లేఖద్వారా చెప్పగలను'' అంది.

అది నిజమేననిపించింది.

ఓ పదిరోజుల్లో మా కుటుంబాన్ని తీసుకొచ్చాను. మేం ఇంటిలో దిగిన మర్నాడు సీత వచ్చింది.

మా ఆవిడ సరోజను పరిచయం చేశాను.

మేం సాహితీ చర్చలో పడ్డాం. సరోజ బెడ్‌రూంలోకెళ్లింది.

కొద్దిసేపు పోయాక, ''సరోజా. టీ తీసుకురా'' అని కేకేశాను.

''మీరూ అందరిలాగేనన్నమాట'' అంది సీత.

నేను తెల్లబోయాను. ఆమె వంక చూ

శాను. మామూలుగానే ఉంది. నా గొంతులోని 'అధికారం' పసిగట్టి అలా గందా? అని ఆలోచిస్తున్నాను.

అంతలో సీత లేచి లోపలికెళ్లింది. సామాన్లు సర్దడంలో సరోజకు సాయపడింది. దాంతో నాకు తప్పలేదు.

రెండు నెలలు పోయాక సీత ఓ చిన్న పత్రికలో చేరినట్లు చెప్పింది.

''మీకు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరమేముంది? అదీ అంత తక్కువ జీతానికి'' అని అడిగాను.

''జీతం ఎంతని కాదు. స్వతంత్రంగా జీవించాలనిపించింది''అంది.

తర్వాత, ఓ పది హేను రోజులకి యశ్వంత్ ఫోన్ చేశాడు. తను తండ్రి కాబోతున్నట్లు చెప్పాడు. అతనికి కంగ్రాట్స్ చెప్పాను. తల్లి అయ్యాక సీతలో మార్పు వస్తుందనుకున్నాను. తను మారలేదు.

''అదేంటండి. సీత ఎప్పుడూ తక్కువ రకం చీరలే కడుతుంది. వాళ్లకు బట్టలషాపు కూడా ఉంది కదా. అదే నేనయితేనా ఎంత మంచి చీరలు కడుదునో. ఉన్నా అనుభవించలేకపోవడమంటే ఇదే''అంది ఒకనాడు సరోజ.

''అంతా నీలాగుంటారా? ఆమెకు ఆర్భాటాలంటే నచ్చవు'' అన్నాను.

మా ఆవిడకు నా మాట నచ్చినట్లులేదనుకుంటా. వంట గదిలోకెళ్లిపోయింది.

మరో రెండు నెలలకు ప్రమోషన్ మీద నాకు బెంగుళూరు బదిలీ అయింది. మేం బెంగుళూరు వెళ్లాక అప్పుడప్పుడూ లెటర్స్ రాసుకునేవాళ్లం. తనకు అబ్బాయి పుట్టాడని రాసింది సీత.

'మా అబ్బాయిని అందరి పిల్లాల్లాగ కాకుండా పెంచుతాను. చిన్నప్పట్నించే స్త్రీని గౌరవించడం నేర్పుతాను. ఆడవాళ్లు మగవాళ్లతో సమానమేననే అవగాహన కల్గిస్తాను నిజాన్ని నిర్భయంగా చెప్పడం అలవాటు చేస్తాను.' అంటూ ఆ ఉత్తరంలో రాసింది.

అబ్బాయి పుట్టిన సంవత్సరం తర్వాత యశ్వంత్ లెటర్ రాశాడు. సీత విడాకులు తీసుకుందనీ, తనెంత వారించినా వినలేదనీ రాశాడు. తను కొంత డబ్బు ఇస్తానన్నా తీసుకోలేదని తెలిపాడు. నేను నిర్ఘాంతపోయాను. ఇలాంటిదేదో జరిగే అవకాశముందని నాకనిపించేది కానీ, ఇంత త్వరగా జరుగుతుందనుకోలేదు.

యశ్వంత్ ఏ ఆడదయినా ఇష్టపడే మగాడు. ఏ దురలవాటు లేదు. నెమ్మదస్తుడు సంపాదన పరుడు. అయితే అతని మార్గం ఆమెకు నచ్చలేదు. ఆమె మార్గానికి అతను రాలేదు.

సీత హైదరాబాద్ వెళ్లి ఓ ప్రముఖ దినపత్రికలో చేరినట్లు తెలిసింది. పోనీలే ఆర్థికంగా ఇబ్బంది వుండదనుకున్నాను. ఏదో ప్రజా సంఘంలో చేరిందనీ, మరుకుగా పాల్గొంటోందనీ విన్నాను. ఆమె స్వభావం నాకు తెలుసుకాబట్టే నేను ఆశ్చర్యపోలేదు.

ఆ తర్వాత రెండు నెలల క్రితం వరకూ సీత విషయాలునాకు తెలీలేదు. ఆఫీసుపని మీద హైదరాబాద్ వెళ్లినప్పుడు ఆమెను కలుసుకుందామని పత్రికాఫీసుకు వెళ్లాను. సీతను కలవాలని వచ్చినట్లు సెక్యూరిటీ రూమ్‌లో చెప్పాను. సెక్యూరిటీగార్డు నన్ను ఆశ్చర్యంగా చూశాడు.

''సీతగారు పోయారండి'' అన్నాడు.

''ఇక్కడ మానేసిందా? ఎక్కడ పని చేస్తుందో తెలుసునా?'' అని అడిగాను.

''ఈ లోకంలోనే లేరండి. టిబితో చచ్చిపోయారు. మూడు నెలలయింది'' అన్నాడు.

నేను షాక్ తిన్నాను.

''నిజమేనా! టిబితో పోవడమేంటి? ఈ రోజుల్లో మంచి మందులున్నాయి. ఇష్టే తగ్గిపోతుంది'' అన్నాను.

''ఆవిడ తన ఆరోగ్యం గురించి పట్టించుకునేవారు కాదండి. మంచి మనిషి. ఎప్పుడూ మా ప్రాబ్లెమ్స్ గురించి అడిగి తెలుసుకునేవారు'' అన్నాడతను గొంతు గద్గదమవుతుండగా.

నరసింహమూర్తి గ్లాసు ఖాళీ చేసి, ముగ్గురి వంకా చూశాడు.

''నువ్వు చెప్పింది విన్నాక జీవితం కంటే సిద్ధాంతమే ముఖ్యమైనదని అనిపిస్తోంది అన్నాడు వీరభద్రరావు.

''అదెలా కుదురుతుంది? సిద్ధాంతమే ముఖ్యమైనదనుకున్నప్పుడు జీవితాన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదు కదా'' అన్నాడు నరసింహమూర్తి.

''సిద్ధాంతమే ముఖ్యమని ఆమె భావించడంవల్లే జీవితాన్ని నిర్లక్ష్యం చేసింది''

''అది తప్పంటాను. తను నమ్మిన సిద్ధాంతానికి న్యాయం చెయ్యాలంటే తను తప్పక బతికి తీరాలి. ఉదాహరణకు ఆమె ప్రభావం నా మీద వుంది. నా కవిత్వం మీద వుంది. సీత బతికుంటే, ఇంకెందర్నో ప్రభావితుల్ని చేసేది కదా'' అన్నాడు నరసింహమూర్తి.

గ్లాసుల్లో విస్కీ పోస్తూ వీరభద్రం మాట్లాడలేదు.

గ్లాసందుకుని, విస్కీ చప్పరించి,

''అంతా విన్నాక నాకనిపిస్తోంది ఒకదాని కోసం వేరొకదాన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదని'' అన్నాడు ఆదినారాయణ.

అంతా మౌనంగా ఉండి పోయారు ఆలోచిస్తూనూ, ఆలోచించకుండానూ.

(సావిత్రిగారి స్మృతికి)